## గౌరారంలో పంట పొలాల పరిశీలన

ఇందల్వాయి, సెప్టెంబర్ 19: మండలంలోని గౌరారం గ్రామంలో ఉన్న పంటపొలాలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ పరిశీలించారు. వరి పంటలో వచ్చే చీడ పీడలపై రైతులకు అవగాహన కల్పించారు. వరికి చీడపురుగు పడితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి సతీశ్, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



క్రీడా దుస్తులతో విద్యార్థులు

జక్రాన్‌పల్లి, సెప్టెంబర్ 19: మండలంలోని కలిగోట్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. దుస్తులు అందజేసిన దాతలకు హెచ్‌ఎం పురుషోత్తమాచారి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కబడ్డీ క్రీడాకారులకు ..**



క్రీడా దుస్తులతో విద్యార్థినులు

మాక్లూర్, సెప్టెంబర్ 19: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల కబడ్డీ క్రీడాకారులకు మార్చ్‌ఫాస్ట్ దుస్తులను కల్లెడలో గ్రామానికి చెందిన ఎర్ర భూమన్న జ్ఞాపకార్థం చిన్న మల్లయ్య 12 జతలు, బండారి నిహన్స్ జ్ఞాపకార్థం మధు 12 జతలు, కొమరే లక్ష్మి జ్ఞాపకార్థం శివయ్య 11 జతలను గురువారం వితరణ చేశారు. హెచ్‌ఎం రామోజీ నాగరాజు చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీ సురేందర్, మల్లయ్య, మధు, శివయ్య, మనీష్‌గౌడ్, ప్రళయ్‌తేజ, మల్లేశ్ పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

మోర్తాడ్, సెప్టెంబర్ 19: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. గురువారం ప్రాజెక్ట్‌లోకి 4140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు)కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1090.90అడుగులు(80.053టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. కాకతీయ కాలువకు 6800 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 200, మిషన్‌భగీరథకు 231, వరదకాలువకు 2వేలు, గుత్ప ఎత్తిపోతలకు 270, అలీసాగర్ ఎత్తిపోతలకు 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## ఫైర్ సేఫ్టీపై అవగాహన

బాల్కొండ, సెప్టెంబర్ 19: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో గురువారం తెలంగాణ విపత్తు స్పందన, బాల్కొండ అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా విపత్తు జరిగితే 101కు సమాచారం అందించాలని అగ్నిమాపక ఫైర్‌స్టేషన్ అధికారి శేఖర్ సూచించారు. అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో వినతిపత్రం అందజేస్తున్న రైతులు



ఆర్మూర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు

# రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- **తహసీల్ కార్యాలయాల ఎదుట రైతుల ధర్నా**

మోర్తాడ్/వేల్పూర్/నందిపేట్/మాక్లూర్/ఆర్మూర్ టౌన్/జక్రాన్‌పల్లి, సెప్టెంబర్ 19: రూ.రెండు లక్షల లోపు వ్యవసాయ రుణాలను వెంటనే మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు జేఏసీ పిలుపు మేరకు గురువారం బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో తహసీల్ కార్యాలయాల ఎదుట రైతులు ధర్నాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. వీటిని సాధించుకోవడానికి ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోర్తాడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీటీ సుజాతకు వినతిపత్రాన్ని అందించారు. వేల్పూర్‌లో రైతులు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నందిపేట్‌లో రైతులు ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాక్లూర్‌లో రైతులు నిర్వహించిన ధర్నాలో బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, ప్రతిపక్ష పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు, రైతులు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత నెలలో రుణమాఫీ కాని రైతులందరూ పట్టణానికి తరలి వచ్చి ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు బేషరతుగా రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చామని అన్నారు. రుణమాఫీ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కానందున తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరుబాట ప్రారంభించామన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు దేగం యాదగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లిలో రైతులు ధర్నా నిర్వహించి తహసీల్దార్ కిరణ్మాయికి వినతిపత్రం అందజేశారు.



మోర్తాడ్ తహసీల్దార్ కార్యాలయం వద్ద డీటీకి వినతిపత్రాన్నిస్తున్న రైతులు



జక్రాన్‌పల్లిలో తహసీల్దార్ కిరణ్మాయికి వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

## ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

మోర్తాడ్/ఏర్గట్ల/బోధన్‌రూరల్/ కోటగిరి/ధర్పల్లి/ సిరికొండ/రుద్రూర్, సెప్టెంబర్ 19: మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండల పరిషత్‌కార్యాలయాల్లో అన్ని పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో ఎంపీడీవోలు తిరుమల, రాజశ్రీనివాస్ బుధవారం సమావేశాలు నిర్వహించారు. రాజకీయ నాయకులు పలు సూచనలు చేశారు. ఈ నెల 13న విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాల్లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21లోగా రాతపూర్వకంగా ఇవ్వాలని మండల అధికారులు సూచించారు. ఏర్గట్లలో వివిధ పార్టీల నాయకలు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శివచరణ్ సమావేశం నిర్వహించారు. బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి సమక్షంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 21వ తేదీలోగా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని బోధన్ ఎంపీడీవో బాలగంగాధర్ అన్నారు. ధర్పల్లిలో ఎంపీడీవో బాలకృష్ణ, కోటగిరిలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, రుద్రూర్‌లో ఎంపీడీవో సురేశ్‌బాబు, వర్నిలో ఎంపీడీవో వెంకటేశ్వర్, చందూర్‌లో ఎంపీడీవో నీలావతి, డిచ్‌పల్లిలో ఎంపీడీవో రవీందర్, జక్రాన్‌పల్లిలో ఎంపీడీవో సతీశ్‌కుమార్, రెంజల్‌లో ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ సమావేశాలు నిర్వహించారు.

## విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



విద్యార్థికి రూ.5 వేల బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

నవీపేట, సెప్టెంబర్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. గురువారం మండలంలోని బినోలా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అంతర్ పాఠశాల క్రీడా పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. బినోలా పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి నిధుల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన అండర్–14, అండర్ 17 విభాగాల్లో 12 టీంలు క్రీడా పోటీల్లో పాల్గొనను న్నాయి. విద్యార్థులు మార్చ్ ఫాస్టు ఆకట్టుకుంది. నాళేశ్వర్ ప్రభుత్వ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సంజన శివతాండవం నృత్యానికి ఎమ్మెల్యే మంత్ర ముగ్ధుడై ఆమెకు రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. ఎమ్మెల్యేను బినోలా వీడీసీ సభ్యులు, నవీపేట మహోదయ క్లబ్ సభ్యులు ఎమ్మెల్యేను వేర్వేరుగా గజ మాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్‌బిన్ హందాన్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఎంఈవో గణేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

- **ప్రొసిడింగ్ పత్రాల అందజేత:** కోటగిరి, సెప్టెంబర్ 19: రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌పీజీ లబ్ధిదారులకు అందజేస్తున్న సబ్సిడీ (రూ.500) కి సంబంధించిన ప్రొసిడింగ్ పత్రాలను గురువారం మండల కేంద్రంలోని చావిడి వద్ద అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ముజబూర్‌బేగ్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, తెల్ల రవికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్, ఎండీ షాహీద్ పాల్గొన్నారు.
- **ఇసుక డంపులకు వేలం:** పోతంగల్, సెప్టెంబర్ 19: మండలంలోని జల్లాపల్లి ఫారం వద్ద సీజ్ చేసిన 30 ట్రిప్పుల ఇసుక డంపులకు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వేలం నిర్వహించారు. 20 ట్రిప్పుల ఇసుకను పోతంగల్ గ్రామానికి చెందిన సయ్యద్ హైమద్ రూ.20,100, పది ట్రిప్పుల ఇసుకను జల్లాపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ హుస్సేన్ రూ.10,100కు దక్కించుకున్నారు.
- **ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం:** డిచ్‌పల్లి, సెప్టెంబర్ 19 : ఇటీవల రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును టీయూ జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగం ఆచార్యుడు ఆర్.సుధాకర్‌గౌడ్‌ను అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, ఏటీయూటీ అధ్యక్షుడు ఆచార్య చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆచార్య అపర్ణ పాల్గొన్నారు.
- **ఎంఈడీ పరీక్షల టైంటేబుల్ విడుదల:** డిచ్‌పల్లి, సెప్టెంబర్ 19: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఈ నెల 28 నుంచి అక్టోబర్ 3వరకు కొనసాగుతాయని పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య ఎం. అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.
- **బీఈడీ రెగ్యులర్ పరీక్షలు ప్రారంభం:** డిచ్‌పల్లి, సెప్టెంబర్ 19: టీయూ పరిధిలో బీఈడీ 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గురువారం ప్రారంభమైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. మొదటి రోజు పరీక్షకు 1312 మంది విద్యార్థులకు 1250 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.
- **కళాశాలల ఆకస్మిక తనిఖీ:** ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 18: జిల్లా కేంద్రంతోపాటు మాక్లూర్, అయిలాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ గురువారం తనిఖీ చేశారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో సమావేశాలు నిర్వహించారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని వెంటనే ప్రతి విద్యార్థి డేటాను పూర్తిస్థాయిలో కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు.
- **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత -** బాల్కొండ, సెప్టెంబర్ 19: మండల కేంద్రానికి చెందిన పలువురు బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్ గురువారం అందజేశారు. ఆరేపల్లి కృష్ణకు రూ.40,000, జక్క గంగనర్సుకు రూ.38 వేలు, ఎర్ల పెద్ద పోశెట్టికి రూ.16 వేలు, గాండ్ల చిన్నయ్యకు రూ.14 వేలు మంజూరు కాగా చెక్కులను అందజేశామన్నారు.
- **పీసీసీ అధ్యక్షుడికి సన్మానం-** శక్కర్‌నగర్, సెప్టెంబర్ 19: పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో విద్యుత్ ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ–327 నాయకులు సన్మానించారు. యూనియన్ నిజామాబాద్ రీజినల్ అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి పూదరి గంగాధర్, నాగరాజు, నిజామాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.
- **ఆర్థిక సాయం -** బాల్కొండ, సెప్టెంబర్ 19: మెండోరాలోని కాకతీయ కాలువలో పడి గాండ్ల అశోక్ శుక్రవారం మృతి చెందగా ఆయన స్నేహితులు (2006 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు) రూ.55 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో ముస్కు సాయిరెడ్డి, అల్లూరి ముత్యం తదితరులు పాల్గొన్నారు.
- **ఇసుక టిప్పర్ పట్టివేత -** బోధన్ రూరల్, సెప్టెంబర్ 19 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులకు అప్పగించినట్లు సాలూరా తహసీల్దార్ శశిభూషణ్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి సాలూరా మండల కేంద్రంలో టిప్పర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు.
- **పాఠశాల సందర్శన -** భీమ్‌గల్, సెప్టెంబర్ 19: మండలంలోని జడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ గోన్‌గొప్పుల పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి గురువారం సందర్శించారు. పాఠశాలలో అమలు చేస్తున్న ఎఫ్ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని, డిజిటల్ తరగతిని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అరుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **హెచ్‌ఐవీపై అవగాహన -** నవీపేట, సెప్టెంబర్ 19: స్థానిక నవోదయ కాలేజీలో గురువారం తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఆర్పీ సుధాకర్ వివరించారు.

## అక్రమ కట్టడాన్ని తొలగించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

భీమ్‌గల్, సెప్టెంబర్ 19: అక్రమంగా చర్చి నిర్మించి, రోడ్డును కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పట్టణంలోని పదో వార్డు కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. గతంలోనే రోడ్డును కబ్జా చేయగా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. వారంలోగా గోడను తొలగించాలని సదరు వ్యక్తికి అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు.

## కనీస పింఛన్ పెంచాలని ఆందోళన

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 19 : కనీసం పింఛన్ కనీస పింఛన్ రూ.ఐదు వేలకు పెంచాలని కోరుతూ భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పొట్ట కూటి కోసం 20 ఏండ్లు పనిచేస్తే వెయ్యి రూపాయల పింఛన్ ఇస్తున్నారని అన్నారు. కనీస పింఛన్ రూ. 5 వేలు ప్రకటించాలని లేనిపక్షంలో దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ బీడీ కార్మిక సంఘం కార్యదర్శి పెద్ద శివయ్య, జిల్లా అధ్యక్షుడు దామోదర్, రాష్ట్ర కోశాధికారి కంది కొండల్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

## ‘పండుగలకు సహకరించిన వారికి కృతజ్ఞతలు’

వినాయక్‌నగర్, సెప్టెంబర్10: గణేశ్ నవరాత్రుల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు,అలాగే మిలాద్ ఉన్ నబీ పండుగ శాంతి యుత వాతావరణంలో జరిగినందుకు సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ హర్షం వ్యక్తం చేశారు. కమిషనరేట్ పరిధిలో సుమారు ఆరు వేల వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. ఈ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించిన వారికి ఆయన పోలీస్ శాఖ తరపున ప్రకటనతో కృతజ్ఞతలు తెలిపారు.

## డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

బాల్కొండ, సెప్టెంబర్ 19: ముప్కాల్ మండల కేంద్రంలో బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ముప్కాల్ గ్రామానికి చెందిన బొల్లి సన్నీ తన స్నేహితులు అన్నెపాక గోపి, చెన్నూరు అరవింద్ బుధవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని భారత్ పెట్రోల్ బంక్‌కు పెట్రోల్ కోసం వెళ్లారు. తిరిగి వస్తుండగా 44వ నంబర్ జాతీయ రహదారిపై లక్ష్మి కెనాల్ బ్రిడ్జి వద్ద అన్నెపాక గోపి నడుపుతున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో సన్నీ, గోపి, చెన్నూరు అరవింద్‌కు గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్సులో నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సన్నీ మృతి చెందాడు. ఇద్దరు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రలు

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 19 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీలో పని చేస్తున్న ఆరోగ్యమిత్రలు జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 17 ఏండ్లుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నామని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని, జీవో 60 ప్రకారం రూ.22,740 వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ యూనియన్ సభ్యులు రామాగౌడ్, విజయ్, సుమలత, శ్రావణ్, అంబిక, జ్యోతి, మణికుమార్, జీవన్‌రెడ్డి, నరేందర్, అఖిల, సాగర్, సాంబాజి, సునీల్, రాధిక, పెద్ది స్వామి, భాగ్యలక్ష్మి, రాములు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం.. టాటా ఏస్ ఢీ యువకుడికి గాయాలు

ఎడపల్లి, సెప్టెంబర్ 19: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పల్లికొండ శంకర్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం నయాబాదుకు వెళ్లాడు. ఆయన తిరిగి వస్తున్న క్రమంలో కొత్త బస్టాండు వద్ద బోధన్–నిజామాబాద్ ప్రధాన రహదారిపై నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్తున్న టాటాఏస్ ఢీకొట్టింది. దీంతో యువకుడు బైక్‌పై నుంచి కింద పడగా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## పరిశుభ్రతపై అవగాహన



బషీరాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

మోర్తాడ్/ఏర్గట్ల/బాల్కొండ/చందూర్, సెప్టెంబర్ 19: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయడానికే ప్రభుత్వం ఏటా స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నదని కమ్మర్‌పల్లి ఏపీఎం కుంటగంగాధర్ అన్నారు. గురువారం కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళాసంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అప్పజెప్పాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ఇంటి పరిసరాల్లో చెత్తతో పాటు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఏపీవో విద్యానంద్ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకోవాలని, అర్హులై ఉండి మరుగుదొడ్లు లేనివారు ఈజీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళాసమాఖ్య సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల సందర్భంగా ఏర్గట్ల మండలం బట్టాపూర్‌లో మహిళా సంఘాల సభ్యులకు పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శి అకుల రవి అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ముప్కాల్ మండలంలోఅధికారులు అవగాహన కల్పించారు. చందూర్‌లోని ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో నీలావతి అవగాహన కల్పించారు. ఎంపీవో మధురిమ, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



బట్టాపూర్‌లో మాట్లాడుతున్న కార్యదర్శి అకుల రవి

## అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం



పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాక్లూర్, సెప్టెంబర్19: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంతోపాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ పిల్లలకు గురువారం ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు సైఫొద్దీన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషక పదార్థాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో జ్యోతి

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్19: పట్టణంలోని సైదాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు ఏసీడీపీవో జ్యోతి, సూపర్ వైజర్ రమణమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ విద్యార్థుల శ్రమదానం



దవాఖాన ఆవరణలో చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

ధర్పల్లి, సెప్టెంబర్ 19 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రమదానం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, స్వచ్ఛభారత్ కమిటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కుమారస్వామి, స్వచ్ఛభారత్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్, అధ్యాపకులు డాక్టర్ రాంచందర్, ప్రవీణ్‌కుమార్, దేవీదాస్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**వెంటనే కావలెను**

★అనఘా లక్ష్మి షాపింగ్‌మాల్‌లో పర్మినెంట్‌గా పనిచేయుటకు 1) సూపర్వైజర్స్ (M/F) అర్హత: డిగ్రీ, 2) అనుభవం గల ఎలక్ట్రీషియన్ అర్హత: (డిప్లమా ఎలక్ట్రిషన్) & 3) కంప్యూటర్ ఆపరేటర్ (M/F) అర్హత: ఇంటర్/డిగ్రీ, ఆసక్తి గలవారు వెంటనే ID ప్రూఫ్, ఫోటోతో నేరుగా సంప్ర||: అనఘా షాపింగ్ మాల్, R.P రోడ్, NZB.

NTZ-334454

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

**గమనిక**


క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## చిరస్మరణీయుడు కోటా సచ్చిదానంద శాస్త్రి

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 19: జిల్లా కేంద్రంలోని గీతాభవన్‌లో హరికథా పితామహుడు దివంగత కోటా సచ్చిదానంద శాస్త్రి సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు కోటా సచ్చిదానంద శాస్త్రి హరికథ సేవలను కొనియాడారు. 1988లో ఆయన జిల్లాకు వచ్చి శ్రీ సీతారామలు కల్యాణ కథను వినిపించారని గుర్తుచేసుకున్నారు. శ్రీపాద సాహితీ కళాపీఠం, ఆదిభట్ల హరికథాకళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీపాదకుమారశర్మ, ఎస్. చిరంజీవాచార్యులు, గణపతి అశోక శర్మ, రాజ్‌కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతం చేయాలి


ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్19: 50 వసంతాల వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ నాయకులు గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ ఈనెల 30న హైదరాబాద్‌లో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

## విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

రుద్రూర్, సెప్టెంబర్19: విద్యుత్ సమస్యలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ద్వారా మార్గం చూపుతామని సీజీఆర్ఎఫ్ (కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ ఫోరం) జిల్లా చైర్మన్ నారాయణ అన్నారు. గురువారం రుద్రూర్ సబ్ డివిజన్‌లో నిర్వహించిన పరిష్కార వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు తమ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఉంటే సంబంధిత అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సొంతంగా పని చేసి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ కిషన్, ఇండిపెండెంట్ మెంబర్ రాజాగౌడ్, డీఈ ముక్తార్, ఏఈలు , సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

## అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు ప్రారంభం

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్19:మండలంలోని చేపూర్ గ్రామంలో ఉన్న క్షత్రియ పాఠశాలలో మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను మున్సిపల్ కమిషనర్ రాజు, మండల విద్యాశాఖ అధికారి రాజగంగారాం గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు తమకు నచ్చిన క్రీడను ఎంచుకొని ఆ క్రీడలో రాణించాలని సూచించారు. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో